# నాగజ్యోతిని అధిక మెజార్టీతో గెలిపించాలి

- రెడ్‌కో రాష్ట్ర చైర్మన్ సతీశ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ జగదీశ్వర్ సతీమణి రమాదేవి
- మల్లంపల్లిలో ప్రచారం



ములుగురూరల్ : మల్లంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ములుగురూరల్, నవంబర్16 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని అధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీ మాజీ చైర్మన్ జగదీశ్వర్ సతీమణి రమాదేవి, రెడ్‌కో రాష్ట్ర చైర్మన్ సతీశ్‌రెడ్డి కోరారు. ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో దివంగత జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ సతీమణి రమాదేవి, కుమారుడు సత్య, రాష్ట్ర రెడ్‌కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో రమాదేవి భావోద్వేగంతో కంటతడి పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మల్లంపల్లి అంటే జగదీశ్వర్‌కు ఎంతో ఇష్టమన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వదించిన ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతికి మల్లంపల్లి ప్రజలు భారీ మెజార్టీని అందించాలని కోరారు. జగదీశ్వర్ కోరిక మేరకు గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన మండల ఏర్పాటును సైతం సీఎం కేసీఆర్ తీర్చారని ఆమె గుర్తు చేశారు. నాగజ్యోతిని గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, సర్పంచ్ చంద కుమారస్వామి, ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చీదల సంతోష్, నాయకులు బత్తోజు ద్రోణాచారి, ఊర విష్ణువర్ధన్‌రెడ్డి, పోదెం కృష్ణ ప్రసాద్, మెార్రి రాజుయాదవ్, శ్రీనివాస్, నరోజు హరినాథ్, రాసమల్ల సురేశ్, చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలింగ్ ఏజెంట్ల వివరాలు త్వరగా అందించండి

- ఉదయం 7 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- అందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తాం
- భూపాలపల్లిలో 23 మంది అభ్యర్థులు పోటీ
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా






సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్, నవంబర్ 16 : భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 317 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పోలింగ్ ఏజెంట్ల వివరాలను అభ్యర్థులు త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా అన్నారు. గురువారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ భూపాలపల్లిలో పోటీ చేస్తున్న అభ్యర్థులతో ఎన్నికల నిర్వహణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 23 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల ఖర్చులను పకడ్బందీగా కేటాయించిన రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. వాటిని ఎన్నికల అధికారులు పరిశీలిస్తారన్నారు. నవంబర్ 21 నుంచి 23 వరకు జిల్లాలో ఎన్నికల పరిశీలకులు పర్యటించి అభ్యర్థుల వివరాలను పరిశీలిస్తారని, ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల ఖర్చులు తనిఖీ చేస్తామన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఓటేసే అవకాశం కల్పిస్తామన్నారు. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకుని రావద్దని, మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్ అధికారులు మాత్రమే సెల్‌ఫోన్ తీసుకు రావడానికి అర్హులని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ కోసం టేబుల్‌కి ఒకరి చొప్పున డిసెంబర్ 1 వరకు కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను అందించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు అయ్యే ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చులో నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రచారంలో వినియోగించే కరపత్రాలు, ఆడియో, వీడియోలకు కూడా ముందస్తు ఎంసీఎంసీ ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జనరల్, పోలీస్ వ్యయ పరిశీలకులు అభయ్ నందన్ అంబష్ట, అమిత్ కుమార్ కౌశిక్‌రాయ్, ఆర్డీవో రమాదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ అంటే మోసం..

- సీఎం కేసీఆర్ సారథ్యంలో సుపరిపాలన
- మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు

కమాన్‌పూర్, నవంబర్ 16 : రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న కేసీఆర్ అంటే ఒక నమ్మకమని.. కాంగ్రెస్ అంటే మోసమని బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మండలంలోని రేపల్లెవాడ, నాగారం, లింగాల, రొంపికుంట, పేరపల్లి, గొల్లపల్లి, పెంచికల్‌పేట, జూలపల్లి, గుండారం గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ హామీలు నీటి మూటలన్నారు. అధికార దాహంతో కల్లబొల్లి మాటలు చెబుతూ.. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మీ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులే నిదర్శనమన్నారు. నేను మీ ఇంటి బిడ్డను.. మీలో ఒక్కడినని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఎప్పుడైనా తన ఇంటికి రావచ్చన్నారు. మీకు అందుబాటులో ఉండి సేవకుడిలా పని చేస్తానని హామీ ఇచ్చారు. మరో అవకాశం కావాలంటూ మంత్రిగా పని చేసిన వారే మళ్లీ మీ ఊరికి వచ్చి చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. మంథనిలో కాంగ్రెస్ వారికి సంబంధించిన 7వేలకు పైగా గోడ గడియారాల వ్యాన్ దొరికిందన్నారు. ఎన్నికలప్పుడే నోట్ల కట్టలతో వస్తారు తప్ప.. ఏనాడైనా పేదలకు సహాయం చేశారా ? అని ప్రశ్నించారు. తన తల్లి పేరిట ఏర్పాటు చేసిన పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని అన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసి అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇవ్వని హామీలను సైతం అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఈసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.



నాగారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

### పుట్ట మధుకు ఘన స్వాగతం

కమాన్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధుకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో వాడవాడల కోలాటం, ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాల మధ్య ప్రచారం సాగింది. అలాగే బీఆర్ఎస్ శ్రేణులు పుట్ట మధుకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, జిల్లా నాయకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న గండ్ర జ్యోతి

# సంక్షేమ ఫలాలే రేపటి గెలుపునకు నాంది

- కేసీఆర్ బీమా కుటుంబానికి ధీమా
- పని చేసే వెంకటరమణారెడ్డిని గెలిపించాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

రేగొండ, నవంబరు 16 : ప్రభుత్వ సంక్షేమ ఫలాలే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డి గెలుపునకు నాంది అని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని భాగిర్దిపేట, దుంపిలపల్లి, పెద్దంపల్లి, నారాయణపురం, జూబ్లీనగర్, రామన్నగూడెం తండా గ్రామాల్లో వైస్ ఎంపీపీ కుందూరు ఉమారాణి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రోడ్డు షోలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలు, అభివృద్ధి పనులను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. మూడోసారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించాలన్నారు. కేసీఆర్ బీమా పేద కుటుంబాలకు ధీమా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకే రాష్ట్రంలో గ్యారెంటీ లేదన్నారు. అలాంటి పార్టీ ప్రజలకు ఏం గ్యారెంటీలు ఇస్తారని విమర్శించారు. అచరణకు సాధ్యం కానీ హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ నాయకులు ఓట్ల కోసం గ్రామాలకు వస్తే ప్రజలు తరిమి కొడతారన్నారు. ఆలోచించి అభివృద్ధి చేసే వారికి అవకాశం ఇవ్వాలన్నారు. భూపాలపల్లి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న వెంకటరమణారెడ్డి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, ఆర్బీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఇంగె మహేందర్, కోఆప్షన్ సభ్యుడు రహీం, రేగొండ మండల ఎన్నికల ఇన్‌చార్జి గండ్ర అభిలాశ్‌రెడ్డి, సుజిత్‌రెడ్డి, మండల అధ్యక్షులు అంకం రాజేందర్, కోలెపాక భిక్షపతి, సర్పంచ్‌లు బొక్క భాస్కర్, జంగిటి నరేశ్, బీక్యానాయక్, పసుల ప్రియాంక, ఎంపీటీసీ మైస సుమలత, శనిగరపు వెంకన్న, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, మైస భిక్షపతి, కే రాజేశ్వర్‌రావు, రజినీకాంత్, లింగారెడ్డి, చంద్రాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మెప్మా కార్యాలయం ప్రారంభం



మెప్మా ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్, నవంబర్ 16 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో గురువారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయాన్ని కలెక్టర్ భవేశ్‌మిశ్రా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, మెప్మా డీఎంసీ రాజేశ్వరి, ఏడీఎంసీ శ్యామ్ బాబు, సీవో నిర్మల, ఆర్పీలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో రమణన్నను గెలిపించండి

**కేయూ జేఏసీ మద్దతు బీఆర్ఎస్‌కే ▪ విద్యార్థి నాయకుడు నరేశ్**

కృష్ణకాలనీ, నవంబర్ 16 : బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కేయూ విద్యార్థి నాయకుడు మంద నరేశ్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థి నాయకుల సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే గండ్ర వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశారన్నారు. రమణారెడ్డి బడుగుబలహీన వర్గాల ఆత్మబంధువన్నారు. భూపాలపల్లి మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజల కోసం పని చేస్తున్న ఎమ్మెల్యే గండ్రను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కేయు విద్యార్థి నాయకుల మద్దతు ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డికే ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి ఎమ్మెల్యే గండ్రను మళ్లీ గెలిపిస్తామన్నారు. ఈ సమావేశంలో కేయూ జేఏసీ నాయకులు సిద్ధు, ప్రసాద్, లక్ష్మణ్, వంశీ, శశీ, అనిల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కేయూ విద్యార్థులు